పట్టపగలు... రోడ్డు ఖాళీగా ఉంది. ఆదివారం... ఆ రోడ్డు మీదుగా ఆ పల్లెటూరు చేరుకునే సర్కారు జీవులకు సెలవు దినం. కొత్తగా వేసిన తారు... సూర్యతాపానికి మెరిసిపోతోంది.

"అరే సూరిగా... ఇట్రారా..."

సూరిగాడికి ఆ కేక వినబడలేదు. విన్నా పట్టించుకునే స్థితిలో లేడు. నిగనిగా మెరుస్తున్న తారు రోడ్డు, చేతిలో ఉన్న చాక్పీసు ముక్కా చూడగానే వాడికి ఇక వేరేవీ కనబడడం లేదు, వినబడ్డంలేదు. వెంటనే మొన్న క్లాసులో నేర్చుకున్న పాఠానికి సంబంధించిన అక్షరాలన్నీ మదిలో మెదులుతూ ఉంటే... చేతిలో ఉన్న చాక్పీసు ముక్క ఇక ఆగడం లేదు. ఉత్సాహంగా రోడ్డు పైనే రాతలు మొదలుపెట్టేసాడు.

"సూరిగా... ఇనపట్టంలేదేట్రా?"

"వాడు చూడే... ఏం సేత్తున్నాడో..." లోపల్నుండి వస్తున్న తల్లి అరుపులకి జవాబుగా ఇద్దరికీ మధ్యలో కూర్చుని ఉన్న సూరి తండ్రి అన్నాడు.

సూరి తల్లి బయటకి వచ్చి చూసింది. సూరిగాడు తదేకంగా రాస్తున్నాడు తారురోడ్డుపై.

"నా బాబే... ఎంతిష్టం చూడు ఆడికి సదువంటే..." తల్లి మురిసిపోయింది.

"సూరిగా... నిన్నేరా!" ఈసారి తండ్రి అరుపుకి తల తిప్పి చూసాడు సూరి. అప్పటికే రోడ్డుపై వాడి రాతలు మెరుస్తున్నాయి, సూర్యుడు వాటిని ఇంకా మెరిపిస్తున్నాడు.


"అమ్మా... నేనే రాసానే... మంచిగున్నయా?" మురిసిపోతూ అడిగాడు సూరి.

"నా బాబే... మంచిగున్నాయిరా..."

"మరి నాకో బుక్కు కొనియ్యవే. కొత్త పేపర్లది... ఇంకా బాగా రాస్తాను అప్పుడు... బాగా సదూకుంటాను..."

"ఉన్నై కదరా బుక్కులు శానా..."

"అవేం బుక్కులే... మీ అయ్యగారి కొడుకు రాసి వదిలేసినవి. పాతవి. నాకు కొత్తది కావాలి... రెండు దిక్కులూ ఖాళీ పేజీలున్నది కావాలి...."



వి.బి. సౌమ్య




"ఒరే సూరయ్యా... ఎలాగో ఆ పుస్తకంతో రాసుకోరా... వచ్చేసారి కొనిస్తాలే..."

"వచ్చేసారంటే వచ్చే సాలుకా?"

"..............."

"పోయే... ఎప్పుడూ ఇదే మాట..." గొణుక్కుంటూ తన చాక్పీసు తీసుకుని వెళ్లిపోయాడు సూరిగాడు.

* * *

సైకిల్ షాపు దగ్గర నిలబడి ఉన్నాడు సూరిగాడు. స్కూలు నుంచి వచ్చే దారి. సైకిల్లోకి పంపు ద్వారా గాలి ఎక్కిస్తూ ఉంటే టైరు గాలికి ఉబ్బడం చూడటం సరదా వాడికి. రోజూ స్కూలు నుంచి వస్తూ, కాసేపు అక్కడ నిలబడి, కాళ్లు నెప్పెట్టే వరకూ లేదా షాపువాడు కసిరే వరకూ నిలబడి చూసి గానీ ఇల్లు చేరడు. అలానే ఆ రోజు కూడా నిలబడి ఉన్నాడు. అప్పుడు రోడ్డుపైన ఎవరో పెద్దాయన వెళుతున్నాడు. చేతిలో ఏదో ఫైలు, నిండా కాగితాలు. ఆయన అదేపనిగా ఆకాశంలోకి చూస్తూ నడుస్తూ ఉండటంతో ఆయనకి నేల కనబడలేదు, రోడ్డుపై అడ్డంగా ఉన్న రాయీ కనబడలేదు. దానితో అది తట్టుకుని కింద పడ్డమూ, ఫైలు కిందపడి కాగితాలు చెల్లాచెదురవడమూ ఒకేసారి జరిగాయి. సైకిల్ షాపు వద్ద ఉన్న పెద్దవాళ్లు ఆయన్ని లేపడానికి వెళ్లారు. సూరి లాంటి పిల్లలేమో ఆ కాగితాలేరడానికి వెళ్లారు. తనవైపు పడిన కాగితాలను ఏరుతూ చేతిలో పెట్టుకుంటూ ఉండగా కనిపించింది సూరికి అది – తెల్లటి తెలుపులో మెరుస్తున్న కాగితం. ఏమీ రాసిలేని కొత్త కాగితం. చూడగానే ఆకర్షించింది అది వాడిని. "తీసుకుందామా? ఇచ్చేద్దామా?" – వాడి మనసు రెండు రకాలుగా ఆలోచించడం మొదలుపెట్టింది. ఓ వైపు తనకు మామూలుగా అయితే దొరికే అవకాశం లేని తెల్లకాగితం... మరోవైపు "ఇలా చేయరాదేమో? అన్న భావన. మొత్తానికి ఇలాంటి సందిగ్ధాలలో ఎప్పటిలాగే "ఇలా చేయ్యొకూడదు" ఓడిపోయింది. ఎవరూ చూడట్లేదని గమనించి, ఆ తెల్ల కాగితాన్ని అపురూపంగా తీసుకుని, తన పుస్తకంలో నెమలీక పెట్టుకున్నట్లు దాచుకుని, మళ్లీ ఏమీ తెలీనట్లు మిగతా కాగితాలు పట్టుకెళ్లి ఆయనకి ఇచ్చేసాడు.

* * *

ఇంటికొచ్చాక కూడా పుస్తకాల సంచీ వదిలి ఆడుకోడానికి వెళ్లిన క్షణం నుండీ మనసంతా దానిపైనే ఉంది. ఎక్కువసేపు ఆడుకోలేకపోయాడు రోజూలా. దాన్ని వాళ్లమ్మ చదువుపై శ్రద్ధగా

అర్థం చేసుకుని మురిసిపోయింది. ఆ తెల్లకాగితం వాడికో కోహినూర్ వజ్రమైపోయింది. రోజూ పొద్దున్నే లేవడం, దాన్నోసారి అపురూపంగా తడమడం... రోజులో వీలైనన్నిసార్లు తనని ఎవరూ చూడటం లేదు అని ఖచ్చితంగా అర్థమయ్యాక - దాన్ని తాకడం.... నవ్వుకోవడం. ఇలా ఎన్నిరోజులు జరిగిందో కూడా లెక్కలేదు. క్రమంగా సూరి పెద్దవాడయ్యాడు. కొంతకొంతగా కాలం కలిసొచ్చి వాళ్ల ఆర్థికస్థితి మెరుగుపడుతూ వచ్చింది. సూరిని పదోతరగతన్నా చదివించగలమో లేదో అనుకున్న తల్లిదండ్రులు అతను పీయూసీ వరకూ వచ్చాక పైచదువులకి కూడా ఏదో ఒక రకంగా కష్టపడి చదివించగలం అనుకునేవరకూ వచ్చింది ఆర్థిక స్థితి. సూరి కూడా వాళ్ల ఆశలకి అనుగుణంగానే బాగా చదువుకుంటూ వచ్చాడు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో చేరాడు.

* * *

"మల్లిక!" ఇప్పటికి అలా అనుకుని ఓ నిట్టూర్పు విడుచుకోవడం సూరికి ఎన్నోసారో లెక్కలేదు. మల్లిక కాలేజీ బ్యూటీ ఏమీ కాదు. చూట్టానికి కళగాఉంటుంది. గలగలా మాట్లాడుతుంది. సదా నగుమోముతో ఉంటుంది. స్నేహితులూ ఎక్కువే. మనసు మంచిదని, సంఘానికి ఏదో చేయాలనే తపన ఉందనీ ఆమెని కొన్నాళ్లుగా గమనిస్తూ వచ్చిన సూరికి అర్థమైంది. ఎలాగోలా కష్టపడి ఆమెతో స్నేహం ఏర్పరచుకున్నాడు. తాను కూడా కాలేజీలోని సంఘసేవా సంస్థలో పేరు నమోదు చేసుకోవడం ద్వారా. తర్వాత అప్పుడప్పుడూ ఆ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం ద్వారా ఆమెతో పరిచయం పెంచుకుంటూ వచ్చాడు. ముందు కేవలం స్నేహమే అన్న ఆలోచనలో ఉన్నా కూడా, అక్కడ చదువు ముగిసి ఇక వెళ్లిపోతాం త్వరలో అన్న భావన కలిగిన రోజు నుంచి కొత్త ఆలోచనలు బయలుదేరాయి. ఆమెతో తన అనుబంధం మరింత దగ్గర చేసుకోవాలన్నది అతని ఆలోచన. అది ఆమెకి చెప్పడమెలాగో తెలీక తనలో తాను ఆమెని తలుచుకుని తనపై జాలితో తానే ఓ నిట్టూర్పు విడుచుకుంటూ వస్తున్నాడు.

ఎదురుపడి చెప్పే ధైర్యమా... లేదు. పోనీ, ఎవరి ద్వారానన్నా చెప్పిద్దామా? అనుకున్నాడు. కానీ, ఇలాంటి విషయంలోనా మధ్యవర్తుల్ని పెట్టుకునేది? అనిపించింది. చివరికి ఉత్తరం రాద్దాం అని నిర్ణయించుకున్నాడు. పదిరోజుల్లో జరగబోయే రక్తదాన శిబిరంలో కలిసినప్పుడు ఇద్దామా అని ఆలోచించాడు.

"రక్తదాన శిబిరమా సరైన ప్రదేశం ప్రేమ లేఖలకి? అయినా, ఇప్పుడు రాసి పది రోజుల తరువాతా ఇచ్చేది?"- మనసు వెక్కిరించడంతో, రేపు సాయంత్రం కలిసి ఇచ్చేద్దాం అని దృఢంగా అనుకున్నాడు.

"తొలిసారి రాస్తున్న ప్రేమలేఖ... మనసుకు నచ్చిన మనిషికి తొలిసారిగా రాస్తున్న లేఖ... జీవితంలో ప్రత్యేక స్థానం అలంకరించబోయే లేఖ... మొదటి అక్షరం నుంచి ప్రతీదీ ఇందులో ప్రత్యేకంగా ఉండాలి..." - ఎన్నో ఆలోచనలతో సూరికి ఊపిరాడ్డం లేదు. ఆ రోజంతా ఏమి రాయాలా అని మనసులో అనుకుంటూనే ఉన్నాడు... పైకి ఏ పని చేస్తున్నట్లు అనిపించినా కూడా. అపుడూ ఇపుడూ స్నేహితులు రాసిన ప్రేమలేఖలను గుర్తు తెచ్చుకున్నాడు. సలహా అడుగుదామనుకున్నాడు గానీ, మళ్లీ ఈ విషయం అందరికీ తెలిస్తే బాగోదని ఆగాడు. మనసులో అనుకుంటూ, నచ్చిన ఆలోచనల్ని ఓ చిత్తుకాగితంపైకి దింపాడు. కాలేజీకి టైమైంది ఇంతలో. ఆ కాగితాన్ని అలానే జేబులో పెట్టు

కుని, లంచ్ టైంలో ఉత్తరం రాద్దామనుకుంటూ బయలుదేరాడు. అప్పుడొచ్చింది ఓ ఆలోచన. కళ్లు మెరిసాయి. తన పెట్టెలో, పాత పుస్తకం ఒకదానిలో అపురూపంగా మడత పెట్టి ఉంచిన తెల్లకాగితాన్ని తీసాడు. చిన్నప్పుడెప్పుడో దొరికిన కాగితం... అలాగే దాచుకున్నాడు వాడకుండా ఇన్నాళ్లూ. కాస్త పాతదనం తెలుస్తోంది కానీ..." ఈ కాగితం చరిత్ర చెబుతూ... తన కోసం దాన్ని తీసి ప్రేమలేఖ రాసానని చెబితే... ఎంత రొమాంటిగ్గా ఉంటుంది?" అనుకున్నాడు. అనుకున్నదే తడువుగా, ఆ కాగితం తీసుకుని, తన క్లాసు పుస్తకంలో పెట్టుకుని బయలుదేరాడు.

మొదటి క్లాసుకీ రెండో క్లాసుకీ మధ్య గంట విరామం ఉండటంతో క్లాసుకి దూరంగా చెట్ల వైపుకి వచ్చి, ఓ ఏకాంత ప్రదేశం చూసి, తన లేఖ ఫెయిర్ చేయడానికి ఉపక్రమిస్తూ ఉండగా, "సూరీ" అన్న పిలుపు వినిపించింది. హడావుడిగా పుస్తకం మూసేస్తూ తల ఎత్తాడు. ఎదురుగా మల్లిక! సూరికి ఆశ్చర్యంగా అనిపించింది. ఇప్పుడే చెప్పేద్దామా అన్నంత ఆవేశం వచ్చేసింది కానీ, ఆమె ఏదో చెప్పడానికి వచ్చిందని గ్రహించి ఊరుకున్నాడు.

"పన్లో ఉన్నావా?"

"లేదు మల్లికా. చెప్పు."

"సూరీ, నీతో ఓ విషయం చెబుదామని వచ్చాను..."

కొంపదీసి ఆమె కూడా ఇందుకే వచ్చిందా? అనుకున్నా కూడా, పైకి మాత్రం - "చెప్పు మల్లికా" అన్నాడు.

ఆమె చెప్పడానికి కాస్త సిగ్గుపడుతున్నట్లు అనిపించింది. సన్నగా నవ్వి, బ్యాగులోంచి ఓ కార్డు తీసింది.

సూరి గుండె కొట్టుకోడం ఓ క్షణం ఆగి, మళ్లీ మొదలైంది.

"సూరీ, నాకు పెళ్లి కుదిరింది. వచ్చే నెల పెళ్లి."

వేరే ఏమీ అనలేక, పైకి నవ్వుతూ - "కంగ్రాట్స్! చెప్పనేలేదేం?" అన్నాడు.

"అంతా అనుకోకుండా, జరిగిపోయింది సూరీ. పోయిన వారమే కుదిరింది. తర్వాత ముహూర్తాల్లేవని వచ్చే నెల్లోనే పెళ్లి అనేసారు...."- బాధో, సంతోషమో అర్థంకాని స్వరంతో చెప్పింది మల్లిక.

సాయంత్రం ఇంటికెళ్లాక ఆ కాగితాన్ని మళ్లీ అలాగే తీసుకెళ్లి మళ్లీ అదే పెట్టెలో, అదే పుస్తకంలో పెట్టేసి, ఓ నిట్టూర్పు విడిచాడు సూరి - ఆలస్యమైపోయింది అనుకుంటూ...

* * *

రోజులు గడిచాయి. క్రమంగా ఈ విషయం మరిచిపోదామని ప్రయత్నిస్తూ... కొంతవరకూ గెలిచాడు. చదువు పూర్తికావొచ్చింది. దానితో ఉద్యోగ ప్రయత్నాలు మొదలుపెట్టాడు.

దేశంలో నిరుద్యోగ సమస్య తాండవం చేస్తున్న రోజులు. మామూలు విద్యార్థి అయిన సూరికి చాలా ప్రయత్నాలైనా కూడా ఉద్యోగం చిక్కలేదు. ఒక్కొక్కరిగా అందరికీ ఉద్యోగాలు వస్తూ ఉంటే, సూరి ఓ పక్క వాళ్ల గురించి సంతోషిస్తున్నా కూడా, తన గురించిన బాధ ఎక్కువైంది. రోజురోజుకీ అందరూ ఒక్కొక్కళ్లూ వెళ్లిపోతూ తాను ఒంటరవడంతో, వేరే ఆలోచనలు లేక అతనిలో న్యూనతాభావం పెరిగింది. తనలో రేగుతున్న వేదనని ఎలా తట్టుకోవాలో అర్థం

చేసుకునే పరిస్థితిలో కూడా లేదు. ఓరోజు "కావాల్సిన మనిషీ చేజారింది... కావాల్సిన జీవితమూ చేజారిపోతోంది... ఎన్నాళ్లిలా?" - తన్ను తానే ప్రశ్నించుకున్నాడు. ఆ క్షణంలో అతనికి ఇక తన జీవితం ముగించుకోడమే సరైన పని అనిపించింది. సమస్యలన్నీ తీర్చే మార్గం దొరికినట్టనిపించింది. ఇంతలోనే, మళ్లీ తల్లిదండ్రులు గుర్తొచ్చారు - వాళ్లు తన మీద పెంచుకున్న ఆశలు గుర్తు వచ్చాయి. కానీ, అది అతనిలో చావు ఆలోచన మానాలన్న కోరిక కలిగించడం బదులు, వాళ్ల ఆశలన్నీ అడియాసలు చేస్తానేమో? అన్న భయాన్ని కలిగించడంతో, ఇక సూరిలో ఆత్మహత్య కోరిక బలపడింది. లేడికి లేచిందే పరుగని... వెంటనే తన ఆలోచనను అమలుపరచాలని నిర్ణయించుకున్నాడు. ఎలా? అని ఆలోచించకుండానే... ఫ్యాను వంక చూసుకున్నాడు. రాత్రికి ముహుర్తం పెట్టాడు. రాత్రి దాకా మరి కాలక్షేపం కావాలి కదా... మధ్యాహ్నం అంతా సినిమా కెళ్లాడు. సాయంత్రం మళ్లా గదికొచ్చాడు. ఎవరితో ఏమీ మాట్లాడలేదు... ఎక్కడ తన మాటల్లో తేడా వాళ్లు కనిపెడతారో అని. గదిలోకొచ్చి కూర్చున్నాక వచ్చిందో ఆలోచన - సూసైడ్ నోట్ రాయాలని. తన మరణం గురించి ఊహాగానాలకు తావుండరాదనీ... తన మరణం వల్ల తోటి విద్యార్థులు సమస్యలు ఎదుర్కోకూడదనీ... తన చావుకి కారణాలను వివరిస్తూ ఓ ఉత్తరం రాద్దాం అనుకున్నాడు. దృష్టి పెట్టె మీదకి మళ్లింది. నెమ్మదిగా ఆవైపు నడిచాడు. ఎప్పటిలాగే ఆ పాత పుస్తకం తీసి, అందులోని కాగితాన్ని తడిమాడు. ఎలాగూ తన జీవితం అంతమవబోతోంది కనుక, ఇప్పుడీ కాగితం వాడేద్దాం అనిపించింది. దాన్ని బయటకు తీస్తూ ఉండగా తలుపు చప్పుడైంది. కాస్త ఉలిక్కిపడ్డా, దాన్ని కప్పిపుచ్చుకుంటూ తలుపు తీసాడు. ఎదురుగా అమ్మా, నాన్నా.

"ఏం చేస్తున్నావ్ రా?" తండ్రి అడగడంతో ఏమిచెప్పాలో తోచలేదు సూరికి. ఏమీ మాట్లాడకుండా పెట్టె వంక చూసాడు. ఆ వైపుకి చూసిన తల్లిదండ్రులు అతను పాత పుస్తకాలు తీయడంతో - పాత రోజులు గుర్తు తెచ్చుకుంటున్నాడనుకుని నవ్వుకున్నారు.

వచ్చినవాళ్లు రెండు రోజులు అక్కడే ఉండటంతో, సూరి ప్లాను పనిచేయలేదు. ఇక వాళ్లు ఉండగా తాను ఇదంతా చేస్తే వాళ్లకేమౌతుందో అన్న భయంతో సూరి ఆ ఆలోచన అప్పటికి మానాడు. వాళ్లు వెళ్లే నాటికి సూరికి వాళ్లతో ఉండి కాస్త మనసుకు తెరిపిగా అనిపించింది. ఆ స్థితిలో మనసు ఆత్మహత్య వైపుకి పోలేదు. ఆ కాగితం అలాగే ఆ పాతపుస్తకపు పేజీల్లో బందీగా కొనసాగింది.

* * *

రోజులు నెలలయ్యాయి. ఓ శుభముహూర్తాన సూరికి ఓ మంచి ఉద్యోగం కూడా దొరికింది. ఇక మళ్లీ అప్పటి ఆలోచన కలిగే సందర్భమే రాలేదు అతనికి. అక్కడ్నుంచి జీవితం చెప్పుకోదగ్గ కష్టాలేమీ లేకుండానే సాగిందని చెప్పాలి. నెలలు సంవత్సరాలయ్యాయి... ఇన్నాళ్లలో ఆ కాగితంపై మోజు మళ్లీ పెరగడం మొదలై, దాన్ని భద్రపర్చుకుంటూ వచ్చాడు, చిన్ననాటి జ్ఞాపకంగా. ఓ శుభముహూర్తాన తన ఆఫీసులోనే పనిచేస్తున్న స్నేహితురాలిని ప్రేమించి పెళ్లిచేసుకున్నాడు. వాళ్లకి ఓ బాబు పుట్టాడు. కాలం గడుస్తూ వచ్చింది. బాబు తన కాళ్ల మీద తాను తొలిసారి నిలబడ్డ రోజు... సూరి ఎంతగా మురిసిపోయాడో మాటల్లో చెప్పలేని విషయం. "నాన్నా..." - బాబు తొలిసారిగా సూరిని పిలిచిన పిలుపు... సూరి ఆనందానికి అవధుల్లేవు. బాబు తోడిదే లోకమైంది సూరి

దంపతులకి.

*  *  *

సూరి కొడుకు ఆడుకుంటూ ఉన్నాడు. ఆడుతూ కిందపడ్డాడు. ఇక ఏడుపు మొదలైంది. ఏడుస్తూ నాన్న దగ్గరికి వచ్చాడు. దెబ్బ చూపిస్తూ మళ్లీ ఏడవడం మొదలుపెట్టాడు. ఏవో పాత పేపర్లు చూసుకుంటూ మధ్యమధ్యన వాణ్ణి మురిపెంగా గమనిస్తున్న సూరికి వాడు కింద పడ్డం చూసినప్పుడే గుండె చెరువైంది. ఇక వాడు ఏడుస్తూ దగ్గరికి వచ్చేసరికి సూరి పూర్తిగా కరిగిపోయాడు. వాడిని దగ్గరికి తీసుకుని, ఎత్తుకున్నాడు. వాడిని ఊరడించాడు... బుజ్జగించాడు... ఏమీ కాదంటూ ఓదార్చాడు. వాడి ఏడుపు ఆగలేదు. సూరికి ఏమి చేయాలో పాలుపోలేదు. ఇంట్లో తానొక్కడే ఉన్నాడు వాడిని చూసుకోవడానికి. తనకా పిల్లల పెంపకం గురించి తెలీదు. సూరికి ఏమి చేయాలో తోచలేదు. ఉన్నట్లుండి-"రాకెట్ చేసీయనా నాన్నా?" గోముగా అడిగాడు. వాడికి ఏమర్థమైందో ఏమో గానీ, కాస్త ఏడుపాపి తలూపాడు. సూరికి ఓ క్షణం ఎందుకన్నానా ఆ మాట అనిపించినా కూడా, ఇప్పుడిక రాకెట్ చేసివ్వడమే తక్షణ కర్తవ్యం అని మాత్రం అర్థమైంది. వచ్చీరాని మాటల్లో వాడు సూరికి ఆలోచించే వ్యవధన్నా ఇవ్వకుండానే "రాకెత్ రాకెత్..." అనడం మొదలుపెట్టేసాడు అప్పటికే. సూరి ఇక రాకెట్ కోసం కాగితం అన్వేషణలో పడ్డాడు. అప్పుడు కనిపించింది మళ్లీ... తాను చూస్తూ ఉన్న పాత కాగితాల మధ్యలో, చిన్నప్పటి పుస్తకం పుటల్లోంచి బయటపడ్డానికి దారుందేమో అని తొంగిచూస్తున్న అప్పటి ఆ తెల్లకాగితం. సూరికి దాన్ని తీసుకునేందుకు మనసొప్పక, వెదకడం కొనసాగించాడు. కానీ, తన తండ్రి చూపు ఓ క్షణం పాటు ఆ కాగితంపై నిలిచి మళ్లీ మరలిపోవడం ఆ పిల్లాడు గమనించేసాడు.

"నానా... పేపర్... పేపర్..." అంటూ దాన్నే చూపడం మొదలుపెట్టాడు. సూరి వాడి దృష్టి మరల్చడం కోసం "అటు చూడు నాన్నా... కిటికీలోంచి ఎవరున్నారో... సూరీడు... నాన్నా అక్కడ కూడా ఉన్నాడు చూడు..." అంటూ ప్రయత్నించాడు. వాడు ఓ క్షణం అటు తిరిగి వెంటనే మళ్లీ ఇటు తిరిగి "పేపర్... పేపర్..". అన్నాడు. సూరికి సంగతి అర్థమైంది.

"ఈ కాగితానికి మోక్షం లభించే సమయం ఆసన్నమైంది" - అనుకున్నాడు. ఇన్నాళ్లైతే ఆపగలిగాడు కానీ, ఇక పిల్లాడి కంటబడ్డాక దాన్ని సంరక్షించడం ఎంత కష్టమో ఆ క్షణంలో అర్థమైంది సూరికి. చిన్నప్పుడెప్పుడో చదివిన అక్బర్-బీర్బల్ కథ గుర్తుకొచ్చింది. ఓ చిన్నపాటి నవ్వు మెరిసింది అతని పెదాలపై. కొడుకు ముచ్చట తీర్చాలని వెళ్లి ఆ కాగితం చేతుల్లోకి తీసుకొని, రాకెట్ తయారుచేసాడు. చేస్తున్నంతసేపూ దానితో పెనవేసుకున్న జ్ఞాపకాలన్నీ కళ్లముందు కదలాడాయి. చివరగా ఓ నిట్టూర్పు విడిచి దాన్ని గాల్లోకి విసురుతూ కొడుకుకి చూపాడు. వాడు కేరింతలు కొడుతూ ఉండగా వాణ్ణి కిందకి దింపాడు. వాడు నవ్వుతూ వెళ్లి దాన్ని అందుకుని... తానూ దాన్ని ఎగరేయడానికి ప్రయత్నం చేయడం మొదలుపెట్టాడు.

వాడి కళ్లలో మెరుపు చూసి సూరి కళ్లలో పుత్రోత్సాహం. వాడి ఆనందం చూస్తే సూరికి దబులానందం. తన తెల్లకాగితానికి ఇన్నాళ్లకి సార్థకత లభించిందనుకున్నాడు... సుపుత్రుణ్ణి, వాడి ఆట వస్తువైన తన చిన్ననాటి నిధినీ చూస్తూ.

పిల్లాడి చేతిలో ఆటబొమ్మై, తన విడుదలని సంబరంగా అనుభవిస్తూ, గాల్లోకి ఎగిరింది తెల్లకాగితం...